



## నేటి నుంచి డిగ్రీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న 83 డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమవుతాయని వర్సిటీ ఎగ్జామినేషన్స్ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ జి.పద్మారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 55 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు 1,050 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

# విజన్ ఆంధ్ర-2047 లక్ష్యంగా..

- అభివృద్ధిని పరుగులు పెట్టించండి
- కలెక్టర్‌కు ముఖ్యమంత్రి ఆదేశం

శ్రీకాకుళం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజన్ ఆంధ్ర-2047 లక్ష్యంగా కలెక్టర్లు పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. బుధవారం సచి వాలయంలో కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా సమీక్షించారు. జిల్లాకు సంబంధించి ఐటీ రంగంలో తీసుకుంటున్న చర్యలు, మూలపేట పోర్టు, క్రీడా హబ్ తదితర అంశాలను సీఎం ప్రస్తావించారు. అభివృద్ధిని పరుగు లు పెట్టించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఆదేశించారు. కలెక్టర్ల సదస్సును కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ప్రత్యక్ష ప్రచారంలో పాల్గొన్నారు.




శ్రీకాకుళం కలెక్టరేట్‌లో హాజరైన జాయింట్ కలెక్టర్, డీఆర్వో



సీఎం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

# ఏం జరుగుతోంది?

- పాతపట్నం ఐసీడీఎస్ అధికారులపై రహస్య విచారణ
- సీఎంవో నుంచి ఆదేశాలతో రంగంలోకి ఉన్నతాధికారులు
- అక్రమాలే కారణమా?



ఈ నెల 9న పాతపట్నంలో అంగన్‌వాడీ కార్యకర్తలను విచారిస్తున్న ఆర్జేడీ

మెళియాపుట్టి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఏం జరుగుతుందో తెలియడం లేదు. గత నెల రోజుల నుంచి ఈ ప్రాజెక్టు పరిధిలోని కొంతమంది అధికారులపై రహస్య విచారణ కొనసాగుతోంది. దీనికి అక్రమాలే కారణంగా తెలుస్తోంది. కొందరు అధికారులు అంగన్‌వాడీ సిబ్బంది నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంవో) ఫిర్యాదు అందడంతో దీనిపై విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. దీనిలో భాగంగానే అధికారులను రహస్యంగా విచారణ చేపడుతున్నారు. ఒకప్పుడు సారవకోట ప్రాజెక్టు పరిధిలో మెళియాపుట్టి, పాతపట్నం మండలాలు ఉండేవి. రెండేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వం వాటిని విభజించి కొత్తగా పాతపట్నం ప్రాజెక్టును ఏర్పాటు చేసింది. కడప జిల్లాకు చెందిన ఐసీడీఎస్ సీడీపీవో విమల రాణి పాతపట్నం ప్రాజెక్టుకు ఇన్‌చార్జి సీడీపీవోగా వచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆమెను బదిలీ చేయాలని కొంతమంది సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే, ఆమెను ఇక్కడే ఉంచాలని ఒక నాయకుడు లెటర్ ఇవ్వడంతో విమలరాణిని ఇక్కడే కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా, ప్రాజెక్టు పరిధిలోని కొంత మంది అధికారులు అంగన్‌వాడీ టీచర్ల నుంచి నెలవారి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై సీఎంవోకు నేరుగా ఫిర్యాదు అందింది. ఈ మేరకు పదిహేను రోజుల కిందట జిల్లా ఐసీడీఎస్ పీడీ తన కార్యాలయానికి పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను పిలిపించి విచారణ చేపట్టి నివేదికను పంపించినట్లు తెలిసింది. అయితే దీన్నిపై మరోసారి విచారణ నిర్వహించాలని సీఎంవో కార్యాలయం నుంచి ఆర్జేడీ చిన్మాయిదేవికి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.

ఈ మేరకు ఈ నెల 9వ తేదీన ఆమె పాతపట్నం వచ్చి రహస్య విచారణ చేపట్టారు. కార్యాలయ సిబ్బందిని బయటకు పంపించి 11 ప్రశ్న లతో కూడిన పత్రాలను అంగన్‌వాడీ కార్యక ర్తలకు వేర్వేరుగా అందించారు. వాటిని నింపి అందించాలని సూచించారు. తద్వారా వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. అసలు విషయం బయటకు రాకుండా రహస్యంగా విచారణ నిర్వహిస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# గంజాయిపై డేగకన్ను

- 'ఈగల్' పేరిట కంట్రోల్ సెల్ ఏర్పాటు
- 20 మంది పోలీసులతో నిఘా
- రవాణా చేసినా, వినియోగించినా ఇట్టే పట్టేస్తారు




ఇచ్ఛాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. దానికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) పేరుతో ప్రత్యేక పోలీస్ దళాన్ని ఏర్పాటు చేసింది. 26 జిల్లాల్లో ఈగల్ కంట్రోల్ సెల్స్ రానున్నాయి. మన జిల్లాలో కూడా పటిష్టమైన వ్యవస్థతో ఈగల్ కంట్రోల్ సెల్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీచేశారు. అమరావతిలో రాష్ట్రస్థాయి నార్కోటిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కానుంది. దానికి అనుబంధంగా మన జిల్లాలో కూడా పటిష్టమైన అధికారులు, సిబ్బందితో నార్కోటింగ్ ఈగల్ సెల్ అందుబాటులోకి తేనున్నారు. జిల్లాలో ఏర్పాటయ్యే విభాగంలో 20 మంది పోలీసు సిబ్బంది ఉండనున్నారు. డీఎస్పీ, సీఐ, ఏఎస్ఐ/హెచ్‌సీ స్థాయి అధికారులు ముగ్గురు పర్యవేక్షిస్తారు. మరో ముగ్గురు హోంగార్డులు ఉంటారు. కార్యాలయ సిబ్బంది ఇద్దరు, కానిస్టేబుళ్లు ఆరుగురు, కంట్రోల్ సెల్‌లో ముగ్గురు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒకరు ఉంటారు. వీరు మూడేళ్ల పాటు ఇదే విభాగంలో కొనసాగుతారు. జీతంతో పాటు 30 శాతం అదనపు జీతభత్యం ఇస్తారు.

### వైసీపీ హయాంలో ఫెయిలైన సెబ్

వైసీపీ ప్రభుత్వం గతంలో మద్యం, మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ఏర్పాటు చేసింది. ఎక్సైజ్ శాఖను అడ్డగోలుగా విభజించింది. సెబ్‌ను మద్యం, మత్తు పదార్థాల నియంత్రణకు, ఎక్సైజ్ శాఖను మద్యం దుకాణాల నిర్వహణకు నియమించింది. కానీ అరకొర సిబ్బందితో మద్యం, మత్తు పదార్థాల నియంత్రణ సాధ్యం కాలేదు. నాసిరకం మద్యం, ఆపై మద్యం ధరల పెరుగుదల కారణంగా గంజాయి, సారా చెలమణి అయ్యింది. దీంతో ఎక్కడికక్కడే గంజాయి పట్టుబడింది. పెద్దఎత్తున ఒడిశా నుంచి జిల్లా మీదుగా రవాణా సాగింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిపెట్టింది. అందుకే ఈగల్‌ను రంగంలోకి దించింది. ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ టీమ్‌లు రంగంలోకి దిగనున్నాయి. రాష్ట్రస్థాయిలో నాలుగు టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటుకానున్నాయి. అమరావతిలో రెండు స్టేషన్లు, గంజాయి రవాణా ఎక్కువగా జరుగుతున్న విశాఖ, పాడేరులో మరో రెండు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ విభాగాలు ఏర్పాటుకానున్నాయి. సీనియర్ ఐపీఎస్ అధికారి రవికృష్ణ ఈగల్ విభాగానికి సారథ్య బాధ్యతలు వహించనున్నారు.



ఇటీవల ఇచ్ఛాపురంలో పోలీసులు పట్టుకున్న గంజాయి

### జిల్లాలో పట్టుబడుతున్న గంజాయి

జిల్లా మీదుగా గంజాయి రవాణాతో పాటు చెలామణి కూడా అధికమైంది. సరిహద్దు ప్రాంతమైన ఇచ్ఛాపురం, పలాసలో ఎక్కువగా పట్టుబడుతోంది. ఒడిశాకు దగ్గరగా ఉండడంతో పెద్ద ఎత్తున చెలామణి అవుతోంది. ఇటీవల వరుసగా గంజాయి అక్రమ రవాణాదారులు పెద్ద ఎత్తున పట్టుబడుతున్నారు. అందులో ఉత్తరాది రాష్ట్రాల వారే అధికంగా ఉన్నారు. గంజాయి రవాణా చేస్తున్నా.. ఎక్కడైనా వినియోగిస్తున్నా క్షణంలో తెలిసిపోయే సమాచార వ్యవస్థ అందుబాటులోకి రానుంది. గంజాయి కేసులను వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేయనున్నారు. వెనువెంటనే నిందితులకు శిక్షలు అమలుచేయనున్నారు. ఇందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా ఐదు చోట్ల ఫాస్ట్ ట్రాక్ కోర్టులు అందుబాటులోకి తేనున్నారు. ఉత్తరాంధ్రకు సంబంధించి విశాఖలో ఏర్పాటుచేసే ఈ కోర్టులో గంజాయి కేసులను వీలైనంత త్వరగా విచారణ పూర్తిచేయనున్నారు. మరోవైపు గంజాయి అచూకీ, ఇతరత్రా సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబరు 1972 అందుబాటులోకి తేనున్నారు. ఇలా ఫోన్ చేసిన వెంటనే గంటల వ్యవధిలో ఈగల్ టీమ్ వాలిపోనుంది. అమరావతిలో ఏర్పాటుచేసే నార్కోటిక్ పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి, మత్తు కేసులను విచారణ చేపట్టవచ్చు. అంతటి విచక్షణాధికారాన్ని కల్పించారు.

### 20 మందితో టీమ్



జిల్లాలో ఈగల్ ప్రత్యేక సెల్ అందుబాటులోకి రానుంది. 20 మంది పోలీస్ టీమ్‌తో ఏర్పాటు కానుంది. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. దీని కోసం ఈగల్ టీంలను ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా వచ్చాయి. నార్కోటిక్ స్టేషన్లు, జిల్లాకు ఒక ప్రత్యేక సెల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు అందుబాటులోకి రానున్నాయి.

**-మీసాల చిన్నమనాయుడు, సీఐ ఇచ్ఛాపురం**

## భూ ఆక్రమణపై లోకేశ్‌కు ఫిర్యాదు

- ఎక్స్ వేదికగా స్పందించిన మంత్రి
- సమస్య సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

కంచిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ భూమిని ఆక్రమించారంటూ కంచిలికి చెందిన హర్జీవ్ సింగ్ కుటుంబం ఎక్స్(ట్విట్టర్)లో మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన ఆయన సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబం వివరాల మేరకు.. 'కంచిలి మండల పరిధిలోని మా పూర్వీకులకు చెందిన భూమి కబ్జాకు గురైందని, అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. శ్రీకాకుళం జిల్లాలో ఒకే ఒక సిక్కు కుటుంబం నివసిస్తోంది. మా తండ్రి సర్దార్ చరణ్ సింగ్ 1950లో ఇక్కడ స్థిర పడ్డారు. ఆంగ్ల విద్య ఈ ప్రాంత ప్రజలకు అందించేందుకు మాకు ఉన్న 3.5 ఎకరాల స్థలాన్ని జేఎంజే పాఠశాలకు ఉచితంగా అందించాం. దాని విలువ ఇప్పుడు సుమారు రూ.12కోట్లు. కొంత మంది తప్పుడు కాగితాలు సృష్టించి మా భూములను అనుభవిస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు కలిసి న్యాయం చేయమని విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదు. మీరే న్యాయం చేయాలి' అంటూ మంత్రి లోకేశ్‌కు ఎక్స్ వేదికగా బుధవారం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని వర్గాలు, మతాలు స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# ఎప్పటికి పూర్తవుతుందో?

- నత్తనడకన విత్తనోత్పత్తి కేంద్రం పనులు
- కేవలం గోదాములు నిర్మించి వదిలేశారు
- సాంకేతిక పరికరాల ఏర్పాటుకు నిధుల కొరత
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

టెక్కలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం బడబంద వద్ద చేపడుతున్న సీడ్ ప్రాసెసింగ్ (విత్తనోత్పత్తి) యూనిట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఐదేళ్ల అవుతున్నా పనులు పూర్తికావడం లేదు. కేవలం గోదాములు నిర్మించి వదిలేశారు. సీడ్ ప్రాసెసింగ్‌కు అవసరమైన పరికరాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో యూనిట్ ఎప్పటికి అందుబాటులోకి వస్తుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రైతాంగానికి విత్తన సమస్యలు తప్పడం లేదు. ప్రైవేట్ డీలర్లకు అధిక డబ్బులు చెల్లించి విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను గుర్తించిన అధికారులు 2019లో నందిగాం మండలం బడబంద వద్ద ఐదు ఎకరాల స్థలంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. రూ.9కోట్లతో అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదన చేశారు. 2019 ఎన్నికల సమయంలో మంజూరు కావడం, అప్పటి ఏపీ సీడ్స్ ఉన్నతాధికారులు వడివడిగా శంకుస్థాపన చేసి 2020 జూన్‌లో ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నిర్మాణ పనులకు అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. మొదటి దశలో ఆ ప్రాంతంలో 20వేల చదరపు అడుగుల్లో రూ.4.70కోట్లతో గోదాముల నిర్మాణం పూర్తి చేశారు. అయితే, గోదాములను ఇప్పటికీ ఏపీ సీడ్స్‌కు అందజేయలేదు. రెండోదశలో కాంపౌండ్‌వాల్, సీసీ రోడ్లు, వేబ్రిడ్జి, డార్మెట్రీ, కార్యాలయం, సాంకేతిక పరికరాలు, మొలక నాణ్యతా పర్యవేక్షణ ల్యాబ్‌లు నిర్మించాల్సి ఉంది. దీనికి సంబంధించిన నిధులు మంజూరు కాకపోవడంతో పనులు జరగడం లేదు.

**ఇతర జిల్లాల నుంచి దిగుమతి**

ప్రస్తుతం జిల్లాలో శ్రీకాకుళం దరి అంపోలు వద్ద సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఉంది. రైతులకు కావాల్సిన వరి, వేరుశనగ, నువ్వులు, ఉలవలు, పెసలు, మినుములు, రాగులు, కందులు, కట్టెజనుము తదితర విత్తనాలను అంపోలు కేంద్రం నుంచే రైతులకు అందజేస్తున్నారు. ఈ విత్తనాల సరిపోకపోవడంతో తెలంగాణలోని హన్మకొండ, కరీంనగర్, జగిత్యాల తదితర ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని తనుకు, పాలకొల్లు, కర్నూలు వంటి ప్రాంతాల నుంచి ఏటా వ్యవసాయశాఖ లక్ష క్వింటాళ్లు తెచ్చి పంపిణీ చేస్తుంది. ఈ విత్తనం సమస్యలు అధి గమించేందుకు బడబందలో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. సీడ్ ప్రాసెసింగ్‌కు పరికరాల కొనుగోలుకు అవసరమైన రూ.4.30కోట్లను మంజూరు చేసేందుకు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.



సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ గొడౌన్

**గోదాముల నిర్మాణం పూర్తిచేశాం**

రూ.4.70కోట్లతో ఇప్పటికే బడబంద ప్రాంతంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో 20వేల చదరపు అడుగుల గోదాముల నిర్మాణం పూర్తిచేశాం, సింగల్‌ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, నీటి సదుపాయాలు సమకూర్చాం. మిగిలిన నిధులు మంజూరైతే మిగతా పనులు జరిపిస్తాం.

**-టి.కోదండరాం, డీఈఈ, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్**

**సాంకేతిక పరికరాలు అమర్చాల్సి ఉంది**

మరో నెల రోజుల్లో గోదాములను అందజేస్తారు. అందులో సాంకేతిక పరికరాలు అమర్చాల్సి ఉంది. అందుకు అవసరమైన నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఇదంతా పూర్తయితే వచ్చే ఖరీఫ్‌కు విత్తనాలు ఇక్కడ నుంచే ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

**- పి.బాలకృష్ణ, ఏపీ సీడ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్.**

# అందరి బంగారం.. రోల్డ్‌గోల్డ్

- రకరకాల డిజైన్లపై మహిళల ఆసక్తి
- అందుబాటు ధరల్లో నగలు లభ్యం
- దొంగల బెడద ఉండదంటున్న వైనం


వన్‌గ్రామ్‌గోల్డ్‌లో ఇలాంటి ఆభరణాలు ఎన్నో..

నరసన్నపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి)

అవి ఒరిజినల్ బంగారు ఆభరణాలు కావు. కానీ మంచి మంచి డిజైన్లలో కనిపిస్తాయి. తక్కువ ధరలో లభ్యమవుతాయి. దొంగల బెడద అస్సలు ఉండదు. దీంతో వన్‌గ్రామ్ బంగారం (రోల్డ్ గోల్డ్) ఆభరణాలను.. సామాన్య మధ్యతరగతి, ఉన్నవారు అనే బేధం లేకుండా అందరూ ఇష్టపడుతున్నారు. బంగారానికి ప్రత్యామ్నాయంగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. రూ.200 నుంచి రూ.20 వేల ధరల్లో లభ్యమౌతున్న ఈ రోల్డ్‌గోల్డ్ ఆభరణాలు ప్రస్తు తం ప్రతీ ఇంటా కనిపిస్తున్నాయి. పిల్లలకు సైతం గాజులు, గొలుసులను వీటినే కొనుగోలు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతోనే పిల్లలకు బంగారం వేశామన్న సంతృప్తితోపాటు ఒకవేళ పొరపాటున వీటిని పారేసుకున్నా బాధపడ వలసిన అవసరం ఉండదని పలువురు మహిళలు పేర్కొంటున్నారు. రోల్డ్ గోల్డ్ ఆభరణాలను ధరించడం ఫ్యాషన్‌గా మారడంతో వీటి అమ్మకాలు జోరుగా సాగుతు న్నాయి. బంగారు షాపుల్లో నిర్వాహకులు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆఫర్లు ప్రకటించి కొనుగోలుదార్లను ఆకర్షిస్తున్నారు. ప్రత్యేక ఎగ్జిబిషన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

### మ్యాచింగ్ కోసం..

ఇటీవల ఫ్యాషన్ పట్ల మోజు పెరుగుతోంది. డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే రీతిలో అభరణాలు ఉండాలని కోరుకుంటున్న మగువల సంఖ్య పెరుగుతోంది. వన్‌గ్రామ్ గోల్డ్‌లో ఎంచుకున్న వెరైటీ లభిస్తోంది. వేసుకున్న కలర్ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే రీతిలో కొన్ని రకాల స్టోన్స్‌తో చేసిన ఆభరణాలను కాలేజీ అమ్మాయిలు అధికంగా ఇష్టపడుతున్నారు. ఇక ఆఫీసులకు వెళ్లే వారైతే సన్నటి గొలుసులతో పాటు బ్రాస్‌లెట్స్ వంటివి ధరిస్తున్నారు. నల్లపూసల దండలు వన్‌గ్రామ్‌లో లభిస్తుండడంతో ఎక్కువ మంది మహిళలు వీటిని వాడుతున్నారు. ఈ రకం దండల్లో వందలాది డిజైన్లు లభిస్తుండడం విశేషం.

### విభిన్న మోడళ్లలో..

వన్‌గ్రామ్ గోల్డ్‌లో పాపిడి బిల్లలు, బ్యాంగిల్స్, హారాలు, నెట్‌చట్స్, చైన్స్ లాంగ్ షెట్స్, ఇయర్ రింగ్స్, యాంటిక్ బేంగిల్స్, నల్లపూసలు, సీజెడ్, యాంటిక్ నెక్ సెట్స్, జ్యూయలరీ వర్స్, వడ్డాణాలు వంటివి పదుల రకాల్లో లభిస్తుండగా ఒక్కోరకం విభిన్న మోడల్స్‌లో లభ్యమౌతున్నాయి. ఒక్కోటి డిజైన్ బట్టి రూ.200 నుంచి రూ.7వేల వరకు ధరలు ఉన్నాయి.

### పెళ్లిల్లకు మరింత ప్రత్యేకం..

పెళ్లిల్లు, ఓణి పంక్షన్ల సమయంలో వధువు మరింత అందంగా కనిపించాలంటే జ్యూయలరీ ఉండాల్సిందే. తక్కువ ఖర్చుతో ఈ వన్‌గ్రామ్ ఆభరణాలు కొనుగోలు చేసి వారిని సింగారిస్తుంటారు. పెళ్లిళ్ల సమయంలో రోల్డ్‌గోల్డ్ ఆభరణాల విక్రయాలు మరింత అధికంగా ఉంటాయి. నిర్వాహకులు వెడ్డింగ్ కలెక్షన్లు పేరిట ప్రత్యేక జ్యూలయరీ విడుదల చేస్తున్నారు. వివాహ సమయంలో పెద్ద హారం, చిన్న హారం, నెక్‌లెస్‌లు, సుంకీలు వంటివన్నీ కలిపి సెట్‌గా ఆఫర్‌తో లభ్యమౌతున్నాయి.

### ఆన్‌లైన్‌లోనూ..

వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాల విక్రయాలు ఆన్‌లైన్‌లోనూ జోరుగా సాగుతున్నాయి. ఆన్‌లైన్‌లో అత్యధికంగా ఎథినిక్ వన్‌గ్రామ్ మంగళసూత్రం, గోల్డ్ ప్లేటిడ్ బాల్స్‌చైన్, భరతనాట్యం కెంపులు, టెంపుల్ స్టోన్స్ నెక్లెస్, పెండింగ్ బార్‌చైన్, స్టీల్‌న్యూ స్టైల్ లాకెట్, నవరత్న చైన్ లాకెట్, గోల్డ్‌పార్మింగ్ పెయిర్ వంటివి కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఒక్కో ఐటమ్ పలు డిజైన్లలో లభిస్తుంది. వీటికి 40శాతం డిస్కౌంట్ ఆఫర్లను వ్యాపారులు ప్రకటిస్తున్నారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న వన్‌గ్రామ్‌గోల్డ్ ఆభరణాలు

### జాగ్రత్తలు తప్పనిసరి..

వన్‌గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ ఎంతో ముచ్చట పడి కొనుగోలు చేస్తున్నా కొద్దిపాటి జాగ్రత్తలు పాటంచకపోతే మాత్రం పెట్టిన సొమ్ము వృథా అవుతుంది. ఈ జ్యూయలరీ ఆరు నెలల నుంచి ఏడాది పాటు అందాలు చిందిస్తుంటాయి. కొద్ది పాటి జాగ్రత్తలు పాటిస్తే పదేళ్లయినా పాడవకుండా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. వీటిని పాలిథిన్ కవర్ లేదా ప్లాస్టిక్ బాక్స్‌లో భద్రపరచాలని చెబుతున్నారు. ఆభరణాలు ధరించిన తరువాత పెర్‌ఫ్యూమ్స్ వంటివి స్ప్రే చేయకూడదు. స్నానం చేసేటప్పుడు ఆభరణాలు తీసి పక్కన ఉంచడం చాలా మంచిది. వేడినీటికి ఆభరణాలు దూరంగా ఉంచడం మంచిది. ఉపయోగించిన తరువాత వాటిని శుభ్రపరిచినట్లయితే వన్‌గ్రామ్ ఆభరణాలు చెడిపోకుండా ఉంటాయి.

### ధైర్యంగా తిరగవచ్చు..



వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు ధరించి శుభకార్యాలలో ధైర్యంగా తిరగ వచ్చు. ఈ ఆభరణాలు మహిళలకు అందాన్నివ్వడమేగాక తేలికగా ఉంటాయి. అందువల్ల స్త్రీలు ఇబ్బందులు పడరు. బంగారు ఆభరణాలు అయితే ప్రతీ క్షణం దానిగురించే ఆలోచిస్తూ ఉండాలి.

-నేతింటి విజయలక్ష్మీ, నరసన్నపేట

### వన్నె తెచ్చేవి ఈ ఆభరణాలే..



ఒళ్లంతా సింగారించుకునే బంగారు ఆభరణాలు చాలా మందికి అందుబాటులో ఉండవు. ఈతరుణంలో మహిళలు ఎక్కువగా ఇష్టపడేవి వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలే. ఇవి స్త్రీలకు ఎంతో వన్నె తెస్తాయి. చూపరులకు ఆకర్షణీయంగా ఉంటాయి. ప్రస్తుతం వీటికే ఎక్కువ ప్రాధాన్యం ఉంది.

-కె.లత, ఉపాధ్యాయురాలు, నరసన్నపేట

### ఈ ఆభరణాలపై మహిళల ఆసక్తి..



మహిళలు వన్‌గ్రామ్‌గోల్డ్ ఆభరణాలపై ఆసక్తి కనపరుస్తున్నారు. సాధారణ మహిళలనుంచి, ఉద్యోగుల వరకూ ఈ ఆభరణాలనే ఎంచుకుంటున్నారు. దీంతో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. మహిళలు అభిరుచుల మేరకు అన్ని రకాల డిజైన్లు అందుబాటులో ఉంచుతున్నాం.

-చక్రధర్, వ్యాపారి, నరసన్నపేట

# బడి ఒక చోట.. అన్నం మరో చోట!

- కమ్యూనిటీ భవనంలో అంగన్‌వాడీ, పాఠశాల తరగతులు
- పరాయి పంచన చిన్నారులు
- ఇదీ దబ్బగూడలో దుస్థితి


కమ్యూనిటీ భవనంలో భోజనం చేస్తున్న విద్యార్థులు


పాడైన పాఠశాల పైకప్పు


ఇదే దబ్బగూడ పాఠశాల..

మెళియాపుట్టి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు- నేడు' పేరుతో పాఠశాలల రూపు రేఖలు మార్చేందుకు కోట్లు ఖర్చుచేశామని ప్రకట నలు చేసినా క్షేత్రస్థాయిలో వాటి ఫలితాలు కనిపించ లేదు. ఎక్కువ గిరిజన గ్రామాల్లో పాఠశాలలకు కనీస స్థాయిలోనూ నిధులు మంజూరు చేయకపోవ డంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. సక్రమంగా ఉన్న పాఠశాలలకు నిధులు మంజూరు చేసి కేవలం రంగులు వేశారు తప్ప ఎటువంటి మరమ్మ తులు చేపట్టలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని దబ్బగూడ మండల పరిషత్ పాఠశాలలో 14 మంది విద్యార్థులు చదువు తున్నారు. అయితే భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక గ్రామంలోని సామాజిక భవనంలో తరగ తులు నిర్వహిస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో అక్కడే గతంలో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఒకపక్క పాఠశాల, మరోపక్క అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు వంట చేస్తుండడంతో ఇబ్బందులు ఎదురవు తున్నాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం గ్రామంలోని ఖాళీగా ఉన్న ఒక ఇంటిలో పెడుతుండడం గమనార్హం. పాఠశాల ఒక దగ్గర, భోజనాలు మరో దగ్గర నిర్వహిస్తుండడంతో నిత్యం చిన్నారులు ఇక్కట్లకు గురవు తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


జాతీయ రహదారుల మంత్రి గడ్కరీకి వినతి పత్రం అందిస్తున్న రామ్మోహన్‌నాయుడు

# శ్రీకాకుళంలో రహదారులను విస్తరించండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ పనులను చేపట్టాలని, పలు రోడ్లను హైవేలుగా అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీకి కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు విజ్ఞప్తి చేశారు. బుధవారం, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రాంతీయ అభివృద్ధి, ఇతర కీలక ప్రాజెక్టులతో సహా శ్రీకాకుళం సమగ్రతకు అవసరమైన రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై చర్చించారు. నరసన్నపేట-ఇచ్ఛాపురం వరకు ఉన్న జాతీయ రహదారిని 6 లైన్లకు విస్తరించాలని, సీఎస్‌పీ రోడ్డు (కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం), డీఎస్‌పీ రోడ్డు (డీఎల్.పురం- నరసన్నపేట-మెళియాపుట్టి వయా భావనపాడు పోర్టు) మార్గాలను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని రామ్మోహన్‌నాయుడు, గౌతు శిరీష కోరారు.


కేశుపురంలో పంటను రక్షించుకునే యత్నంలో రైతులు

# రైతుల్లో తుఫాన్ గుబులు

- చిన్నపాటి చినుకులతో కోతలు నిలుపుదల
- పంటను రక్షించుకునేందుకు పాట్లు

పలాసరూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో రైతులు పండించిన పంటలపై తుఫాన్ గండం పడుతోంది. పంటను కుప్పలుగా పెడదామంటే రోజురోజుకూ వాతావరణంలో మార్పులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మంగళ వారం రాత్రి నుంచి చినుకులు పడి ఆగడంతో బుధవారం ఉదయం నాటికి రైతులు పొలాల్లో ఉన్న కంకులను ఎత్తి కుప్పలు పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఎండిన వరి కంకులను ఒక చోటకు చేర్చడం, కుప్పలపైన టార్పాలిన్లను కప్పి చివరి ప్రయత్నం చేశారు. మరో రెండు రోజుల పాటు ఇదే వాతావరణ పరిస్థితి ఉంటుందని సమాచారం తెలియడంతో ఆందోళనకు గురవుతున్నారు. గాలులు వీస్తుండడంతో ముందు జాగ్రత్తగా పంటకు రక్షించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ముసురు అధికంగా ఉండడం, గాలులు వీస్తుండడంతో ఎప్పుడు వర్షం వచ్చి పడుతుందోననే భయంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

## 17న 'వంశధార' డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు

టెక్కలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నౌపడా వంశధార డిస్ట్రిబ్యూటరీకి సంబంధించి టెక్కలి వంశధార కార్యాలయంలో ఈనెల 17న ఎన్నిక నిర్వహించనున్నట్లు వంశధార ఈఈ బి.శేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష పదవికి సంబంధించి ఉదయం 9గంటల నుంచి 9.15 వరకు నామినేషన్ల స్వీకరణ, 9.30కు నామినేషన్ల తుది జాబితా, 9.30 నుంచి 10గంటల వరకు ఎన్నికల ప్రక్రియ, 10 నుంచి 10.30గంటల మధ్యలో లెక్కింపు, ఫలితాలు ప్రకటన ఉంటుందని తెలిపారు. అలాగే ఉపాధ్యక్ష పదవికి సంబంధించి ఉదయం 11గంటల నుంచి 11.15 వరకు నామినేషన్ల స్వీకరణ, 11.15 నుంచి 11.30 వరకు నామినేషన్ల తుది జాబితా, 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఎన్నికల ప్రక్రియ, 12 నుంచి 12.15గంటల లోపు లెక్కింపు ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు.

# 10 వేల జనాభా ఉన్నా.. హైస్కూల్ లేదు

- ఇబ్బందులు పడుతున్న 700 మంది విద్యార్థులు
- సుదూర ప్రాంతాల్లోని హైస్కూళ్లకు వెళ్తున్న వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- ఇదీ నువ్వలరేవులో పరిస్థితి


నువ్వలరేవు గ్రామం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలోనే కేవీటీలు కులస్తులు ఉన్న ఏకైక గ్రామం నువ్వలరేవు. పదేళ్ల కిందటి వరకు ఓసీ కుల జాబితాలో ఉన్న వీరిని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు బీసీ-ఎ చేర్చారు. చేపల వేటే వీరి ప్రధాన జీవనాధారం. వీరిలో ఉన్నత చదువులు చదివే వారు చాలాతక్కువ. ఫీజులు చెల్లించలేక ప్రాథమిక విద్యతోనే చదువులు ఆపేస్తుంటారు. 10 వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో హైస్కూల్ లేదు. ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉంది. హైస్కూల్ మంజూరు చేయాలని గ్రామస్థులు ఎన్నిసార్లు నాయకులు, అధికారులకు కోరుతున్నప్పటికీ ఫలితం శూన్యం. ఒడియా మీడియం అయినా వీరు ఉన్నత చదువుల కోసం తెలుగు మాధ్యమంలో కూడా అధికంగా చేరుతున్నారు. గ్రామంలో హైస్కూల్ లేకపోవడంతో బాలికలు ఉన్నత చదువులకు దూరం అవుతున్నట్లు గ్రామపెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వజ్రపుకొత్తూరు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరంపల్లి హైస్కూల్‌కు వెళ్లి చదువుకోవల్సి వస్తుంది. ఈ రెండు హైస్కూళ్లలో నువ్వలరేవు విద్యార్థులే అధికంగా ఉన్నారు. 700 మందికి పైగా విద్యార్థులు ప్రతిరోజూ సుదూరం వెళ్లిరావడం ఇబ్బందిగా ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో నువ్వలరేవు గ్రామానికి హైస్కూల్ మంజూరు అవుతుందనే ఆశతో గ్రామస్థులు ఉన్నారు.

### హైస్కూల్ మంజూరు చేయాలి..



నువ్వలరేవు గ్రామానికి హైస్కూల్ మంజూరు చేయాలని వైసీపీ ప్రభుత్వానికి అనేక సార్లు వినతులు అందించాం. నాయకులు హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం అమలు కాలేదు. ప్రతిరోజూ విద్యార్థినులు నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ హైస్కూల్‌కు వెళ్తున్నారు. దీనివల్ల ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా హైస్కూల్ మంజూరు చేయాలి.

-ఎజ్రా, సర్పంచ్ నువ్వలరేవు

### కూటమి ప్రభుత్వమే స్పందించాలి..



కూటమి ప్రభుత్వం స్పందించి నువ్వలరేవుకు హైస్కూల్ మంజూరు చేయాలి. 700 మందికి పైగా విద్యార్థులు ఉన్నత చదువుల కోసం గ్రామానికి దూరంగా ఉన్న ఇతర హైస్కూళ్లకు వెళుతున్నారు. గ్రామంలో హైస్కూలు ఏర్పాటు చేస్తే బాలికల విద్య మరింత పెరుగుతుంది.

-బి.దేవా, ఉపసర్పంచ్, నువ్వలరేవు

## విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగింపు నేపథ్యంలో ఈ నెల 13న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనుగులవలస, వెంకరావుకాలనీ, ఎంపీడీవో కార్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఇండస్ట్రీయల్ ఏరియా, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

## జాబ్‌మేళా రేపు

సోంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధికాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బారువ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి.రామారావు తెలిపారు. 19 నుంచి 45 ఏళ్ల వయస్సు గల పది, ఇంటర్, డిప్లమా, డిగ్రీ చదివినవారు హాజరుకావలని కోరారు. పూర్తి వివరాలకు 9502 82143 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

## ఇద్దరు సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి తన కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్‌బీ(ఎక్స్) సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.సూర్యనారాయణను కాశీబుగ్గ అర్బన్ సీఐగా, కాశీబుగ్గ అర్బన్ సీఐగా పనిచేస్తున్న దాడి మోహన్‌రావును డీఎస్‌బీ(ఎక్స్)కి బదిలీ చేశారు. అలాగే విశాఖ రేంజ్ పరిధిలో మరో ఆరుగురు సీఐలను డీఐజీ బదిలీ చేయగా.. ముగ్గురు విజయనగరం జిల్లాకు, పార్వతీపురం మన్యం, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఒక్కొక్కరు చొప్పున బదిలీ అయ్యారు.

## వరి పంట అగ్నికి ఆహుతి

సరుబుజ్జిలి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పాతపాడు గ్రామానికి చెందిన బెవర మల్లేశ్వరరావు పంట పొలంలో వరిచేను దగ్ధమైందని ఆమదాలవలస ఫైర్ ఆఫీసర్ కె.అప్పారావు తెలిపారు. ప్రమాద నష్టం సుమారు రూ.50 వేలు వరకు ఉంటుందన్నారు. తన పొలం పక్కనే ఉన్న వేరొక రైతు ఆయన పొలంలో వరిచేను నూర్పు చేయగా మిగిలిన గడ్డికి అగ్గిపెడుతుండగా అగ్నిజ్వాలలు తన పొలంలోకి వ్యాపించి కాలిపోయినట్టు బాధితుడు తెలిపారు.

## పట్టణంలో క్రిస్మస్ సందడి

ఇచ్ఛాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం, కవిటి మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన టౌన్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖకు చెందిన బిషప్ కేఆర్ సింగ్ క్రీస్తు ప్రేమను క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు పత్తి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## సౌదీలో ఉద్యోగావకాశాలు

గుజరాతీపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, అల్ యూసుఫ్ ఎంటర్ ప్రైజస్ సంయుక్తంగా బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన యువతకు సౌదీ అరేబియాలో గల పునరావాస కేంద్రాల్లో ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ బుధవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఆసక్తిగల యువత ఈనెల 15వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆయా అభ్యర్థులకు ఈ నెల 18న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో 18 నుంచి 40 ఏళ్ల మధ్య గలవారు ఏదైనా ఆసుపత్రిలో ఏడాదిన్నర పాటు పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. ఆసక్తిగల వారు తమ బయోడేటాతోపాటు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలన్నారు.

## భగవద్గీత చదవాలి

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యలను అధిగమించేందుకు, మానసిక ప్రశాంతతకు భగవద్గీత చదవాలని పరాత్మానంద స్వామి అన్నారు. భగవద్గీత సప్తాహం సందర్భంగా ఉపనిషన్మందిరంలో బుధవారం ప్రవచనాలు చెప్పారు. మనిషిని మనిషిగా తీర్చిదిద్దే ఆలోచనలను అందించి ప్రపంచ సాహిత్య చరిత్రలో తలమానికంగా భగవద్గీత నిలిచిందని అన్నారు. జీవితాన్ని గడపడమే ఉత్తమ జీవన మార్గమని, మోక్షమార్గమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కోమలరావు, డాక్టర్ సుధీర్, పతంజలి శాస్త్రి, ప్రభాకర్, మోహన్‌రావు, కామేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

## టెన్నిస్ టోర్నీ పరిశీకునిగా భాస్కర్

ఎచ్చెర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఉడిపి, కర్ణాటక)లో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత అంతర్ జోన్ మహిళల టెన్నిస్ టోర్నమెంట్‌కు పరిశీలకునిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పీడీ డాక్టర్ ఎ.భాస్కర్ నియమితులయ్యారు. వర్సిటీల సంఘం నుంచి ఈ మేరకు ఉత్తర్వులు బుధవారం అందాయి. ఈ మేరకు నియామక పత్రాన్ని భాస్కర్‌కు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అందజేశారు.

## నిర్వహణపై దృష్టి సారించాలి

జి.సిగడాం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెత్తనుంచి సంపద కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని డీఎల్‌పీవో ఐవీ రమణ అన్నారు. బుధవారం ఎందువ, జి.సిగడాం త దితర గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించారు. ఎంపీడీవో టి.రామకృష్ణ, సర్పంచ్ జోగినాయుడు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్య తీరేదెప్పుడో?



మిషన్‌కొట్లు రోడ్డులో అన్‌లోడింగ్ చేస్తున్న వ్యాపారులు

మార్కెట్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్

ఇచ్ఛాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి మార్కెట్ జంక్షన్ వద్ద నిత్యం భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భారీ వాహనాలు టౌన్ నుంచి రావడం వల్లే ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోందని ప్రజలు వాపోతున్నారు. దీనికితోడు మిషన్ కొట్లు రోడ్డులో మధ్యాహ్నం కూడా లోడింగ్ అన్‌లోడింగ్ చేయడం వల్ల మరింత ట్రాఫిక్ సమస్య ఎదురవుతుంది. ట్రాఫిక్ సమస్య తీరాలంటే భారీ లారీలు టౌన్‌లోకి రాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచి, వారి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు శ్యామలరావు, కార్యదర్శి సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బుధవారం 5వ రోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెక్నికల సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 అమలు చేయాలని, రిటర్మెంట్ కింద రూ.10లక్షలు ఇవ్వాలని, విధి నిర్వాహణలో చనిపోయిన కార్మిక కుటుంబాల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, వారాంతపు సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యదర్శి కె.అప్పలరాజు, ఉపాధ్యక్షులు జె.గురుమూర్తి, ఎస్.పార్థసారధి, రామచంద్ర, రామారావు, మణి, ముకేష్, శ్రీను, త్రినాథ్, బి.సతీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మతల్లికి ఎన్ఈఆర్ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎన్ఈఆర్, రజిని దంపతులు

రణస్థలం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం వారు గ్రామాల్లో ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మంగళవారం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రీడా ప్రాంగణంలో ధర్మప్రచార రథం వద్ద ఆలయ పురోహితులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, రజిని దంపతులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేపట్టారు. భవానీభక్తులు, అయప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో పురోగతి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

గుజరాతీపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన పురోగతి లభిస్తుందని మూడవ అదనపు జిల్లా న్యాయాధికారి సీహెచ్ వివేకానంద్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్‌లో మధ్యవర్తిత్వంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వం వలన ప్రజల కాలం, కోర్టు ఫీజుల నుంచి త్వరితగతిన పరిష్కారం పొందుతారన్నారు. తద్వారా కోర్టు సమయం కూడా వృథా కాకుండా ఉంటుందన్నారు. ఈ సదస్సులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఈశ్వరరావు, కార్యదర్శి అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోజూ చెత్త సేకరించాలి

లావేరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజూ చెత్తసేకరణ పనులు చేపట్టాలని శ్రీకాకుళం డీఎల్‌పీవో ఐవీ రమణ చెత్తసేకరణ కార్మికులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రం లావేరు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతీ రోజూ సేకరించిన చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసి ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. ఈవోపీఆర్‌డీ విశ్వేశ్వరరావు, కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## 'వికసిత్ భారత్'లో వర్సిటీ భాగస్వామ్యం పెరగాలి

ఎచ్చెర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వకసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమాల్లో వర్సిటీ భాగస్వామ్యం పెరగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలోని అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధ్యాపకులు, రీసెర్చ్ ఫోరం సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు తప్పనిసరిగా జరగాలన్నారు. అలాగే పరిశోధనా వ్యాసాల ప్రచురణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్‌లో మెంటర్‌గా సమర్థవంతమైన మార్గదర్శకత్వం పోషించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కె.స్వప్నవాహిని తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతకు అండగా ఉంటాం

ఆమదాలవలస, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు వైసీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణ పరిధి బొడ్డేపల్లిపేటలో ఉన్న పార్టీ కార్యాలయంలో బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 13న కలెక్టరేట్ కార్యాలయాల వద్ద సమస్యలు పరిష్కారం కోరుతూ రైతులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, దుంపల చిరంజీవి, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికాభివృద్ధి సాధించాలి

కవిటి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని సభ్యులంతా ఆర్థికాభివృద్ధి సాధించాలని స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు అశోక్ చక్రవర్తి అన్నారు. కవిటిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. క్లస్టర్ ఏరియా కోర్డినేటర్ రామ్మోహనరావు మాట్లాడుతూ.. అన్ని సంఘాలు ఏగ్రేడ్‌లో ఉండాలన్నారు. ప్రతీ మహిళా జీవనోపాధి మెరుగుపర్చుకునేలా గ్రామ సంఘాలు తయారవ్వాలన్నారు. సమావేశంలో హౌసింగ్ కోర్డినేటర్ మల్లేశ్వరరావు, ఏపీఎం గోవింద్, స్త్రీనిధి మేనేజర్ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

## విధులు పక్కాగా నిర్వహించాలి

కంచిలి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహించ కుండా సకాలంలో సేవలు అందించాలని ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. బుధవారం అంపురం, జాడుపూడి గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ, రికార్డులు పరిశీలించారు. పౌర సేవలో జాప్యం చేయకూడదని సిబ్బందికి సూచించారు. అనంతరం జాడుపూడిలో నిర్మాణ దశలో ఉన్న మినీ గోకులం షెడ్లు పరిశీలించారు. ఏపీవో ధనంజయ, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

# 'ఎల్‌హెచ్ఎంఎస్'ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రిస్మస్, సంక్రాంతి పండగలు రానున్న తరుణంలో ప్రజలు తమ విలువైన ఆస్తులను ఆభరణాలను భద్రపరిచేందకు ఎల్‌హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్)ను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పిలుపునిచ్చారు. ఈ మేరకు డీఎస్పీ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. క్రిస్మస్, సంక్రాంతి పండుగ నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లేవారు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్ఎంఎస్ విధానం ద్వారా చోరీ జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. పూర్తి వివరాలను తమ సమీప పోలీసు స్టేషన్ల అందిస్తే ఆ ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సీసీ కెమెరాలను ఎస్పీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కి లింక్ చేసి ఆ ఇంటిని పర్యవేక్షిస్తారన్నారు. ఏవరైన ఇంట్లో చొరబడినట్లైతే కంట్రోల్ రూమ్‌కి సమాచారం రావడంతో క్షణాల్లో పోలీసులు అక్కడకు చేరుకుని దొంగలను పట్టుకుంటారని డీఎస్పీ వివరించారు. ఈ సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎటువంటి చార్జీలు వసూలు చేయమని, ఉచితంగానే ఈ సేవలు అందిస్తామన్నారు. ప్రస్తుతం నగరంలో రెండు చోట్ల ఇళ్లల్లో సీసీ కెమెరాలు పెట్టి పర్యవేక్షిస్తున్నామన్నారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక రిక్వెస్ట్ వచ్చిందని తెలిపారు. గతేడాదిలో 23 మంది ఈ విధానాన్ని వినియోగించుకున్నారని, ఈ ఏడాది ఇప్పటివరకు 30 మంది వినియోగించుకున్నట్టు చెప్పారు. చాలా మందికి దీనిపై అవగాహన లేక వినియోగించడం లేదని, ఎటువంటి అపోహలు, సందేహాలు లేకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

## వర్సిటీ అనుబంధ కళాశాలలకు క్రిస్మస్, సంక్రాంతి సెలవులు

ఎచ్చెర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ అనుబంధ డిగ్రీ, పీజీ, బీఈడీ తదితర కళాశాలలకు సెలవుల షెడ్యూల్‌ను వర్సిటీ ప్రకటించింది. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు క్రిస్మస్ సెలవులు, వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. తిరిగి కళాశాలలు జనవరి 20వ తేదీన పునః ప్రారంభమవుతాయని చెప్పారు.

# అంతర పంటలతో అధిక లాభాలు



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అంతర్ పంటలు సాగు వల్ల రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం వత్సవలసలో ఎంపీటీసీ సభ్యులు తెలుకూటి యర్రారావు ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై స్పింకర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్ పంటలు సాగు పట్ల కూడా రైతులు ఆసక్తి చూపుతున్నారని, ప్రభుత్వం కూడా ఈ రైతులకు ప్రోత్సాహం అందిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు ఎంతో మేలు చేసే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం ఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా ఆదిత్యుని కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవిల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవిల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మార్గశిర సుద్ధ ఏకాదశిని పురష్కరించుకుని బుధవారం ఆదిత్యుని కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామి కల్యాణ నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామి కల్యాణ శ్వేత వస్త్రాలతో పాటు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. కల్యాణం నిర్వహించిన వారిలో ఫణీంద్రశర్మ, శ్రీనివాసశర్మ, వికాస్, పార్థసారధి తదితరులు ఉన్నారు. అలాగే స్వామి వారిని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ బుధవారం దర్శించుకున్నారు. గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అనివెట్టి మండపంలో ప్రకాష్‌ను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## రేషన్ షాపులో తనిఖీలు

సోంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాణిగాం రేషన్ షాపులో విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 79కిలోల బియ్యం, 12ప్యాకెట్ల కందిపప్పు, పామాయల్ 11.5 ప్యాకెట్లు తేడా ఉన్నట్టు గమనించినట్టు విజిలెన్స్ సీఐ బి.రామారావు తెలిపారు. ఈ తనిఖీల్లో అధికారులు లక్ష్మణరావు, ఆర్ఐ బి.కిరణ్, వీఆర్వో వి.హరీష్, ఎస్.తిరుపతి ఉన్నారు.

## బీజేపీ బూత్ కమిటీ ఎన్నికలు

ఎచ్చెర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీల ఎన్నికలను నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు అన్నారు. అల్లినగరం గ్రామంలో బూత్ కమిటీ ఎన్నికను బుధవారం నిర్వహించారు. మండలంలోని 90 బూత్ కమిటీల్లో ఇప్పటి వరకు 11 బూత్ కమిటీల ఎన్నికలు పూర్తయ్యాయని చెప్పారు. ప్రతి బూత్ కమిటీలో ఒక అధ్యక్షుడు, మరో 11 మంది సభ్యులను ఎన్నుకున్నట్టు చెప్పారు. నామినేషన్లను స్వీకరించి ఎన్నికలు జరుపుతున్నామన్నారు. అల్లినగరం 248, 249 బూత్ కమిటీలకు చెరొక నామినేషన్ రావడంతో మాడుగుల సన్యాసిరావు, కె.గణేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. రిటర్నింగ్ అధికారి వజ్జిపర్తి రఘురాం, పార్టీ మండల అధ్యక్షుడు పుణ్యపు శంకర్, నాయకులు మాడుగుల శ్రీనివాసరావు, మాడుగుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళలు సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. బుధవారం గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలోని శ్రీహరిపురం గ్రామంలో మాదక ద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం వినియోగించుకోండి

గార, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.త్రినాథస్వామి అన్నారు. బుధవారం లింగాలవలసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీ బగ్గు రజని, ఏవో దుంపల పద్మావతి, రైతులు, ముద్దాడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. తర్వాత పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# టెక్కలి కంపుకొడుతోంది

- స్పందించని పంచాయతీ అధికారులు
- మంత్రి ఆదేశాలు బేఖాతర్
- ఇదీ మేజర్ పంచాయతీలోని దుస్థితి

టెక్కలి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీలో దుర్గంధం వెదజల్లుతోంది.. ఏ వీధి చూసినా చెత్తకుప్పలు, మురుగుకాలువల్లో సిల్ట్ పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణమే కనిపిస్తోంది. నిత్యం పారిశుధ్య పనులు పర్యవేక్షించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడికి వెళ్లినా ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. పూడికలు తొలగించడం, చెత్తను తరలించడం చేపట్ట కపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటించే ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచడం, మిగిలిన ప్రాంతాలపై నిర్లక్ష్యం వహిస్తుండడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కొత్తవీధి, కంచ్రవీధి, గొల్లవీధి, ఆదీఆంధ్రా వీధి, చిన్న బజారు, మెట్టవీధి తదితర ప్రాంతాల్లో పారిశుధ్యలోపం స్పష్టంగా కనిపి స్తోంది. ఆగస్టు ఒకటిన మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కలిసి కంచ్రవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. యుద్ధ ప్రాతి పదికన పనులుచేపడతామని పంచాయతీ అధికారులు తెలిపి నామమాత్రంగా చేపట్టి వదిలేశారు. దీంతో ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలు దర్శనమిచ్చి దుర్గంధంతో ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


టెక్కలి కంచ్రవీధి ప్రాంతంలో కాలువ ఇలా..


లక్ష్మీనరసింహస్వామి ఆలయం జంక్షన్‌లో..


కంచ్రవీధిలో కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు (ఫైల్)

## క్రైం కార్నర్

### గంజాయి ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ఆరుగురు వ్యక్తులు గంజాయి వ్యాపారం చేయడంతో పాటు వారు కూడా గంజాయి తాగుతుండగా అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచా మని సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చీకటి బ్లాక్ కే.సువాని గ్రామానికి చెందిన బోర లోకేష్‌తోపాటు ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన కత్తుల అనిల్, కీలు ఢిల్లేశ్వరరావు, కత్తుల సంతు, మాడా ఆశీష్, తోటూరు గ్రామానికి చెందిన మున కాల శ్యామ్ కె.సువాని గ్రామంలో 2.350 కిలోల గంజాయి కొనుగోలు చేసుకొని ఇచ్ఛాపురం వచ్చి పట్టణంలోని ఓ థియేటర్ వద్ద అనుమానంగా కనిపించారు. దీంతో పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు తనిఖీ చేసి వాళ్ల వద్ద గంజాయి ఉన్నట్టు గుర్తించి సీజ్ చేయడంతో పాటు అరెస్టు చేశారన్నారు. అయితే వీరంతా గత రెండేళ్లుగా గంజాయి కొనడానికి, అమ్మడానికి, తాగడానికి అలవాటు పడ్డారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నమనాయుడు ఉన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వృద్ధుడు

పలాస, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో సుమారు 60 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ డి.మోహనరావు తెలిపారు. అతని చేతిపై పోళ్ల దుర్యోధన, బోరభద్ర అని రాసి ఉందని, ఆయనకు సంబంధించిన వివరాలు తెలిస్తే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

### పాము కాటుతో మహిళ..


ఆదిలక్ష్మి (ఫైల్)

గార, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తుండగా ఓ మహిళ పాము కాటుకు గురై మృతి చెందింది. కళింగపట్నం పంచాయతీ తాన్ సాహెబ్ పేట గ్రామానికి చెందిన కిలుగు ఆదిలక్ష్మి(50) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంది. ఈ మేరకు బుధవారం పొలంలో పనులు చేస్తుండగా పాము కాటుకు గురైంది. ఆదిలక్ష్మిని పీహెచ్‌సీకి తరలించేలోగా ఆమె చనిపోయింది. ఆది లక్ష్మికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదిలక్ష్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదు కోవాలని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు కోరుతున్నారు. ఆదిలక్ష్మి భర్త గన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జనార్దనరావు కేసు నమోదు చేశారు.

### గుర్తు తెలియని జంతువు దాడిలో ఆవు, దూడ..

హరిపురం, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): లోహరిబంద, ఎల్ కొత్తూరు గ్రామాల్లో ఆవుతోపాటు ఒక లేగ దూడ గుర్తుతెలియని జంతువు దాడిలో మృతి చెందినట్లు రైతులు తెలిపారు. ఎల్.కొత్తూరు తోట ల్లోని పశువుల శాలలో కట్టిన ఆవు మంగళవారం రాత్రి మృతిచెందగా.. సోమవారం రాత్రి అందాల జగ్గా రావుకు చెందిన లేగదూడపై గుర్తు తెలియని దాడి చేసి సగానికి పైగా తినివేయడంతో మృత్యువాత పడింది. వరుసగా రెండురోజుల్లో రెండు పశువులు మృతిచెందడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. మృతిచెందిన పశువులకు పశువైద్యులు దువ్వాడ శ్రీకాంత్ పోస్టుమార్టం నిర్వహించగా అటవీ శాఖాధికారులు పరిశీలించారు. కొండపిల్లి లేదా హైనా వంటి జంతువులు దాడిచేసి ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు. పశువులు, జీవాల రక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు గాయాలు

పలాసరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గరుడఖండి-చినబాడాం ఖానా వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ అంపోలు చందుకు గాయాలయ్యాయి. పలాస నుంచి గరుడఖండికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న చందు అదుపు తప్పి బైక్ పైనుంచి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు, కాలికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ ఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అనుమతి లేని భవనాలపై చర్యలు


పలాసలో భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

పలాస, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా భవనాలు నిర్మిస్తే చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు హెచ్చరించారు. పట్టణంలో పలు భవన నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులపై ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువగా భవన నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, మునిసిపల్ నిబంధనల ప్రకారం ప్లాన్ అనుమతులు తీసుకొని నిర్మాణాలు లేకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉదయపురం, గొడగలవీధి, శివాజీనగర్, నేతాజీ నగర్, వివేకానందకాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు.

### వైసీపీ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణదాస్

టెక్కలి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో బుధవారం వైసీపీ కార్యాలయాన్ని మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. ప్రజల పక్షాన పోరాడేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, అందరూ కలిసికట్టుగా ఉండాలని కోరారు. రైతులకు దగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 13న జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, జడ్పీటీసీలు పేడాడ భార్గవి, దుబ్బ వెంకట్రావు, పాల వసంతరెడ్డి, నాయకులు రోణంకి మల్లయ్య, సత్తారు సత్యం తదితరులు పాల్గొన్నారు.

#### ముఖ్య నాయకుల డుమ్మా

ఈ కార్యక్రమానికి పలువురు ఆ పార్టీ ముఖ్యనేతలు డుమ్మాకొట్టారు. దీంతో వారిమధ్య గ్రూపులు మరోసారి బహిర్గతమయ్యాయి. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణి, టెక్కలి, సంతబొమ్మాళి వైసీపీ పార్టీ కన్వీనర్లు కిల్లి అజయ్, కోత సతీష్, ముఖ్య నాయకులు చింతాడ మంజు తదితరులు గైర్హాజరయ్యారు. దీంతో ఆ పార్టీ కార్యకర్తల్లో గుసగుసలు వినిపించాయి.

### రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వైఫల్యం

నరసన్నపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి సర్కారు వైఫల్యం చెందిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈనెల 13న చేపట్టనున్న రైతు సమస్యలపై పోరాట ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బెడిసికొట్టిన వేతన ఒప్పంద చర్చలు

- ఏడు శాతం పెంచుతామన్న మిల్లర్లు
- 30 శాతానికి కార్మికుల పట్టు
- 26 అర్ధరాత్రి వరకు డెడ్‌లైన్..

ఆ తరువాత సమ్మెలోకి: కార్మికులు


మాట్లాడుతున్న కార్మికసంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి

పలాస, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్ కార్మికులు, వ్యాపారుల మధ్య జరిగిన వేతన ఒప్పంద చర్చలు బెడిసికొట్టాయి. ఇప్పటికే ఒకసారి చర్చలు విఫలం కాగా రెండో ధపా చర్చలు బుధవారం నిర్వహించారు. అయితే ఇవి కూడా సఫలం కాలేదు. కార్మిక సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి మాట్లా డుతూ.. ఈనెల 26వ తేదీలోగా చర్చలు ఫలించకుంటే ఆ రోజు అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మె చేపడతారని హెచ్చరించారు. కేటీ రోడ్డు డోకి రామారావు రైస్ మిల్లులో వ్యాపారులు, కార్మికుల మధ్య బుధవారం చర్చలు జరిగాయి. గతంలో 40 శాతం వేతనాలు పెంచాలని కార్మికులు కోరగా ప్రస్తుతం 30 శాతమైనా పెంచాలని ప్రతిపాదన చేశారు. అయితే యాజమాన్యాలు ఏడు శాతం పెంచుతామని చెప్పడంతో కార్మికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈనెల 26న తుది దశ చర్చలు జరుపుతామని, ఆ లోగా వేతనాలు పెంచేందుకు ముందుకు రాకుంటే సమ్మె తప్పదని నాయకుడు కృష్ణమూర్తి స్పష్టం చేశారు. దీనిని కార్మిక శాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు లిఖిత పూర్వకంగా తెలియజేయడం జరుగుతుందని కార్మిక సంఘ నాయకులు ప్రకటించారు.

## సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట


మాట్లాడుతున్న కలమట రమణ

హిరమండలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు ఈనెల 14న జరగ నున్నందున అన్ని సంఘాల్లో టీడీపీ మద్దతుదారులు విజయం సాధించాలని, దీని కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పాటుపడాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. బుధవారం హిరమండలంలో విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీపీ, జనసేన నుంచి నీటి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు విజయం సాధించి తీరాలన్నారు. దీనికోసం ఎమ్మెల్యేలు, పార్టీ మండలాల అధ్య క్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. రైతు సమస్యలకు పెద్దపీట వేసే వారికి అవకాశం కల్పించాలన్నారు. కూటమి నాయకులంతా ఒకే మాటపై ఉండి విజయానికి పాటుపడాలన్నారు.

## తోపుడు బండ్ల వ్యాపారులను ఇబ్బందులు పెట్టడం తగదు

టెక్కలి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఫుట్‌పాత్‌లు, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులను అధికారులు ఇబ్బందులు పెట్టడం తగదని సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్య అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో తోపుడుబండ్ల సంఘ కార్మికులతో సమావేశం నిర్వహించారు. దుకాణాలను తొలగించి చిరు వ్యాపారులను రోడ్లపై పడేయడం సమంజసం కాదన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా పేదల బతుకులపై దాడులు చేయడం దారుణ మన్నారు. ఇప్పటికైనా అధికారులు ఫుట్‌పాత్ పేదలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వరదరాజులు, తిరుపతి, ఉపేంద్ర, పురుషోత్తం, త్రినాథ్, కామరాజు, సింహాచలం, కారుణ్య, ప్రేమనందం తదితరులు పాల్గొన్నారు.

## తిమడాం హెచ్‌ఎంపై డిప్యూటీ డీఈవో విచారణ

జలుమూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జలుమూరు మండలం తిమడాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి బుధవారం విచారణ చేపట్టారు. విద్యార్థులకు టీసీ ఇచ్చే సమయంలో హెచ్‌ఎం డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని, నాడు-నేడు పనులపై ఉద్దేశపూరంగా హెచ్‌ఎం నిర్లక్ష్యం చేస్తున్నారని, పాఠశాలలో చెట్లను అమ్ముకుని సొమ్ము స్వాహా చేశారని గ్రామస్థులు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు హెచ్‌ఎంను విచారించి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. విచారించారు. దీనిపై డీఈవోకు సమగ్ర నివేదికను అందిస్తామని ఆమె తెలిపారు.

## ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు కృషి: బగ్గు



పోలాకి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగిం చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గత ఏడాది వర్షాల కు కూలిపోయిన అంధవరం వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.84 లక్షలు నిధులు మంజూరు చేసింద న్నారు. ఈ మేరకు సదరు పనులకు బుధ వారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు తిరుపతిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

జలుమూరు/పోలాకి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం అంధవరం, ముబుగాం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం రైతు పట్టాదార్ పాస్ పుస్తకాలతోపాటు, సర్వే రాళ్లపై కూడా అప్పటి సీఎం జగన్ ఫొటో ముద్రించి రైతులకు సమస్యలు సృష్టించిందని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కరిం చేందుకు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు జె.రామారావు, ఎం.సురేష్‌కుమార్, ఎంపీడీవో అప్పలనాయుడు, సర్పంచ్ పిట్టశాంతి, ఎంపీటీసీ బైరి నీలమ్మ, వ్యవసాయాధికారి పి.చిరంజీవి, సర్వే శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులతో పల్లెల్లో ఆనందం: ఎంజీఆర్


సింగుపురంలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సింగుపురం గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు పనులు కూటమి ప్రభుత్వ సమర్థ పాలనకు తార్కాణంగా నిలుస్తు న్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.చంద్రకుమారి, పలు శాఖల అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ● పాస్టర్ ఫ్యామిలీ ఫెలోషిప్ కార్యక్రమం నిర్వహణకు ఎమ్మెల్యే గోవిందరావు రూ.20 వేల విరాళాన్ని బుధవారం అందించారు. స్థానికంగా జరిగిన పాస్టర్స్ ఫ్యామిలీ ఫెలోషిప్ వేడుకల్లో ఆయన పాల్గొని ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

### మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

కోటబొమ్మాళి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మాదవ ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపే ప్రక్రి యలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. బుధవారం కోటబొ మ్మాళిలో పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, కళాశాల విద్యార్థులు 'సంకల్పం'లో భాగంగా భారీ ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాలకు వెళ్లి కరపత్రాలు అందించి అవగాహన కలిగించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సూచించారు. పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# ఘనంగా గీతాజయంతి వేడుకలు


పెంటూరు వెంకటేశ్వర ఆలయంలో గీతాపారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

నందిగాం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో గీతాజయంతిని బుధవారం ఘనంగా నిర్వహిం చారు. పెంటూరు, కాపుతెంబూరు, దిమ్మిడిజోల గ్రామాల్లోని ఆలయాల్లో గీతా పారాయణం చేపట్టారు. పెంటూరు వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తలు బొడ్డ జనార్దనరావు, కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

### భగవద్గీతను నిత్యం పారాయణ చేయాలి

పాతపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భగవద్గీతను ప్రతి వ్యక్తి నిత్య పారాయణ చేయాలని, తద్వా రా మంచి ఫలితాలు సాధించవచ్చని పశుసంవర్ధకశాఖ ఏడీ డా.మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాల ప్రాంగణంలో గీతాజయంతిని రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వేణుగోపాలస్వామి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. భగవద్గీత సారాన్ని అన్వయించు కోవడం ద్వారా మానవజీవన గమనం సక్రమంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో కొరసవాడ పశు వైద్యాధికారి పి.అనిల్‌కుమార్, సిబ్బంది విజయ్ కుమార్, ఒడిరి కుమారి మోహన్ పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న భగవద్గీత శ్లోకాలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా ఈదుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో భగవద్గీత శ్లోకాలు పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన చిన్నారులు నవ్య, శివప్రసాద్ భగవద్గీత శ్లోకాలు వినిపించారు. హెచ్‌ఎం వి.తమ్మయ్య, ఉపాధ్యాయులు రాంబాబు, నీలకంఠం, రామకృష్ణ, శశిభూషణ్ పాల్గొన్నారు


పాతపట్నం: వేణుగోపాలస్వామి విగ్రహానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న అధికారులు


భగవద్గీత శ్లోకాలు ఆలపించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## న్యూస్ బాక్స్

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పోలాకి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముబగాం విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్ లో మరమ్మతులు చేపడుతున్నందున గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో టెక్కలి ఈఈ జి.శంకరరావు, పోలాకి ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ముబగాం, వనితమండలం, ముబగాం కాలనీ, ఖాన్‌సాహెబ్‌పేట, కత్తెరవానిపేట, గజపతినగరం, తలసముద్రం, జొన్నాం, కొల్లివలస, మల్లపేట, దుబకవానిపేట, జనావానిపేట తదితర గ్రామలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### రేపు పాతపట్నం పరిధిలో..

పాతపట్నం డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పాతపట్నం 132-33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ఈఈ జి శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాతపట్నం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, బోరుభద్ర, గురండి, బగదల గోపాలపురం, సీతారాంపల్లి, చంగుడి, సరాళి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం తదితర గ్రామాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీముఖలింగేశ్వర స్వామి గ్రామోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు స్వామిని పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో బి.ప్రభాకరరావు, సిబ్బంది, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### 'వంశధార' రికార్డులు కాల్చేశారని ప్రచారం


కాగితాలు కాల్చివేసిన దృశ్యం

టెక్కలి డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వంశదార డివిజన్ కార్యాలయానికి సంబంధించిన పలు రికార్డులను బుధవారం కార్యాలయం వెనుక భాగంలో కాల్చివేశారన్న ప్రచారం సాగింది. విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకునే సరికే కాగితాలు కాలి బూడిద య్యాయి. ఈ విషయమై వంశదార ఈఈ బి.శేఖరరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించ గా ఈనెల 17న డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలు జరగనున్నాయని, దీనికి సంబంధించి ఓ గది శుభ్రం చేయాల్సి ఉన్నందున ఆ గదిలో ఉన్న పాత కాగితాలను కాల్చివేయడం జరి గిందని, ఎటువంటి రికార్డులు కాల్చి వేయలేదని పేర్కొన్నారు.

### బ్యాంకింగ్ రంగంపై అవగాహన పొందాలి

నరసన్నపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బి.ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ విద్య అభ్యసిస్తున్న ఒకేషనల్ విద్యార్థులకు ఆన్‌ది జాబ్ శిక్షణలో భాగంగా బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, డి.రాంప్రసాద్, కె.రవి, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు